# స్పైన్ (స్వయం) ఫ్లూ!

సుబ్బారావు పరమ శుభ్రరస్తుడు! అసలు ఇండియాలో పుట్టవలసినవాడు కాదు. విదేశాల్లో ఏ దొరసాని కడుపులోనో జన్మించాల్సినవాడు.

అతగాడి ఖర్మకాలి... దురదృష్టవశాత్తూ ఈ దేశంలో... మన రాష్ట్రంలో పుట్టేడిచాడు!

ఇంట్లో సైతం కాళ్ళకు సాక్స్... స్లిప్పర్స్ లేనిదే నడవడు. పొరపాటున కాలికి మట్టి అంటుకుంటే ప్రాణం విలవిల్లాడుతుంది.

ఏది తినాలన్నా... ఇంట్లో వాష్‌బేసిన్ ముందు నిలబడి పావుగంటసేపు లైఫ్‌బాయ్ సోపుతో... డెట్టాల్ లిక్విడ్‌తో... ఇంకా మురికి చేతికి వున్నది... పోలేదని భావిస్తే యాసిడ్‌తోనో చేతులు పిసుక్కుంటు కడుక్కుంటాడు.

తిండి ముగియగానే మళ్ళీ అదే తంతు! నోరు ఫినాయిల్‌తోనో... కిరోసిన్‌తోనో పుక్కిలిస్తాడు.

ఇక స్నానం విషయానికొస్తే... సున్నిపిండితో ఒకసారి... శీకాయపొడితో మరొకసారి... కుంకుడు పులుసు నురుగుతో మూడవసారి... చివరగా మైసూర్‌శాండిల్ సోపుతో వళ్ళు రుద్ది రుద్దీ... గంటసేపటి గానీ బాత్‌రూమ్‌లోంచి బైటపడడు. అలా శరీరాన్ని శుభ్రపరచుకుంటే తప్ప సుబ్బారావుకి తృప్తిగా వుండదు నిద్రపట్టదు.

తనేకాదండీ బాబూ... ఇంటిల్లిపాదికీ ఇదే శిక్ష!

యావజ్జీవ కారాగార శిక్షకంటే... మరణశిక్షకంటే క్లిష్ఠమైన వళ్ళు తోముడు... చేతులు పిసుకుడు శిక్ష బాధాకరమైనదిగా కుటుంబ సభ్యులందరూ భావిస్తారు. ఇదేం పనిష్మెంట్‌రా దేవుడాని విలవిల్లాడతారు.

కన్నవారైనా... కట్టుకున్నదైనా... కడుపున పుట్టిన బిడ్డలైనా సరే సుబ్బారావు నిర్ణయానికి 'నో' అనటానికి ధైర్యంలేదు.

గొణుగుళ్ళు... సణుగుళ్ళు ససేమిరా విన్పించటానికి వీల్లేదు. మనిషి చండశాసనుడు. ఖర్చుకు వెనకాడే ప్రశ్నేలేదు.

నెలకు యాభై లైఫ్‌బాయ్ సోపులు... పాతిక కేజీల శికాకాయ పొడి... మరో పాతిక కేజీలు కుంకుళ్ళు... పది డజన్ల మైసూర్‌శాండల్ సోప్స్... పాతిక లీటర్ల (ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వారు సర్టిఫై చేసిన) డెట్టాల్ లిక్విడ్ కొనటం చూస్తూ... సూపర్ మార్కెట్‌వాళ్ళు ఇరుగు పొరుగువారు ఆశ్చర్యపోయి ముక్కున వేలేసుకోవటం కద్దు!

ఇక ఇంటి పరిశుభ్రత విషయానికొస్తే... అగ్గిపుల్ల ముక్కగాని... పేపరు పీసులు గాని... కేశరాజాలు గాని... నేలమీద కన్పిస్తే చాలు మనిషి 'ఫైరై'పోతాడు. అలా పడేసినందుకు పాతిక గుంజీలు తీయిస్తాడు. గదికి రెండేసి చొప్పున వేస్ట్ పేపర్ బాస్కెట్లుంటే నేలమీదెందుకు పడేయటమంటూ గాండ్రిస్తాడు. కాన్వెట్‌కు వెళ్ళే పిల్లలు సైతం తమడ్రెస్ శుభ్రతతోపాటు ఇంటినీ పరిసరాలను నీట్‌గ వుంచాలంటూ రోజూ క్లాసు పీకుతాడు సుబ్బారావు.

అతని మాటకి ఇంట్లో ఎదురులేదు.

పనిమనిషి ఉదయం సాయంత్రం ఇల్లు వూడ్చి వెళ్ళినా... గంటకోమారు అన్ని గదులూ కుంచె చీపురుతో భార్య తుడవలేదంటే... ఆమెకు మూడిందన్నమాటే!

వీధిన వెడుతున్నప్పుడు కూడా... ఏ కంకర రాయో... చిత్తు కాగితమో... ప్లాస్టిక్ కవరో కళ్ళబడితే చాలు వాటిని ఏరి తీసుకెళ్ళి స్వయంగ మున్సిపాలిటీ వారు ఏర్పాటుచేసిన చెత్తకుండీలో వేసి మళ్ళీ వెనకొచ్చి ఇంట్లో చేతులు శుభ్రపర్చుకోనిదే దినచర్య ముందుకు సాగదు.

శుభ్రం కాదుగానీ... ఇంత చాదస్తం కూడదంటూ కన్నవారు పైకి నోరు తెరిచి మాట్లాడినా... పెళ్ళాం పిల్లలు మనసులో మూలిగినా స్పేర్ చేయడు.

సుబ్బారావ్ సత్ ప్రవర్తన చూచి దోవనబోయే వారు పళ్ళికిలించి... పాపం పిచ్చోడు... అనుకోవటం కద్దు.

ఎవరేమనుకున్నా... ఎన్ని విధాలుగ కామెంట్ చేసినా క్రిటిసైజ్ చేసినా... లక్ష్యపెట్టడు.

పరిశుభ్రతకే ప్రాముఖ్యత అనేది సుబ్బారావు నినాదం! ఆ విధంగ పరిశుభ్రత పాటించని వారంతా సుబ్బారావు దృష్టిలో అయోగ్యులు... దేశద్రోహులు!

కుండీలు ఏర్పాటుచేసినా అడ్డమైన దాన్నీ రోడ్డుమీదకు విసిరేసేవారంటే అతగాడికి రోత పుడుతుంది! వళ్ళు మండుతుంది!

పరిశుభ్రత గురించి నిర్లక్ష్యం చేస్తారు కాబట్టే... అడ్డమైన రోగాలతో బాధపడాల్సి వస్తుంది అంటూ అడిగినవారికి అడగనివారికి స్వయం సేవకుడిలాగ హితబోధ చేస్తూంటాడు. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపడితేనేం? ప్రజలు సహకరించకపోతే దురవస్త తప్పదంటూ వాదిస్తాడు.

రోడ్లు రోతగా వున్నా... ఈగలు దోమలు స్వైర విహారం చేస్తున్నా... సుబ్బారావు మనసు వేదనకు గురౌతుంది. వీధులు తళతళమంటూ అద్దంలా మెరిసే రోజెన్నడొస్తుందో ఈ దేశంలో?... అనేసి వాపోతాడు.

ఆఫీసులో అయినా సరే ఇదే వరస! ఎవ్వరూ సీట్లలో లేకపోయినా 'ఫాన్లు' తిరుగుతుంటూ సుబ్బారావు గుండె తరుక్కుపోతుంది. వేస్టేజి గురించి ఎవరూ పట్టించుకోరేం అనుకుంటూ లేచి వెళ్ళి ఫ్యాన్ స్విచ్‌లు ఆఫ్‌చేసి అటెండర్‌కుంక చేయాల్సిన విధిని కర్తవ్యాన్ని తనే నిర్వహిస్తాడు పాపం సుబ్బారావు!

ఏ విషయంలోనైనా... 'మనకెందుకులే... మనదేం పోయిందిలే' అని అనుకోడు!

★ ★ ★ ★ ★

పనిమనిషి తోమి శుభ్రపరచిన వంటింటి సామగ్రిని మళ్ళీ మళ్ళీ 'విమ్' పౌడర్‌తోనో సోప్‌తోనో భార్యను కడగమంటాడు. లేకుంటే ఇన్ఫెక్షన్ వస్తుంది అంటూ గావుకేకలు పెడతాడు.

'అయ్యో! హజ్బెండ్‌గారూ!... చాకిరీ చెయ్యలేక చేతులు పడిపోతున్నయ్. మా సంగతి వదిలేయండి. మీ కంచం గ్లాసు ఎన్నిసార్లు కావాలనుకుంటే అన్నిసార్లు తోముకోండి! వాటిని మినరల్ వాటర్‌తో కడుక్కోండి...' వళ్ళు మండి భార్య ప్రసూన అందొకసారి.

'ఇదిగో నోరెత్తావంటే నీ నోట్లో ఫినాయిల్ పోస్తాను. భార్యవైయ్యుండి 'లేకి'గ మాట్లాడినా... 'సెటైర్లు' వేసినా... జోకులేసినా... వెటకారంగ రిప్లై ఇచ్చినా వూరుకునేదిలేదు...' ఫైరైనాడు సుబ్బారావు.

ఇంకా ఏదో చెప్పబోతున్న ప్రసూన మాటకి అడ్డొచ్చి 'స్వైన్‌ఫ్లూ' అంటురోగం అన్ని దేశాలూ పయనించి... రాకెట్ వేగంతో వచ్చి... ఇప్పుడు మనబారినపడింది. తెలుసా! ఇకపై ఇంట్లో మెంబర్సందరూ 'మాస్క్'లు కట్టుకోవాలి! ఇది అత్యంత వేగంగ పాకగల మహమ్మారట! పేపర్లు... టి.వీ.లు... నాయకులు... అపోజిషన్ వాళ్ళూ ఘోషిస్తున్నారు. ఎవరు దానిబారిన పడి 'హరీ' అంటారో అర్థమై చావటల్లేదు. వ్యాధి నివారణోపాయం తెలీక డాక్టర్లు తలలు బద్దలు కొట్టుకుంటున్నారట! నిన్ననే వస్తూ ఓ పాతిక మాస్క్‌లు కొనేడిచి తెచ్చాను. వాటిని ప్రతి ఒక్కరూ ధరించాలి!'

'ఓ! అలాగే...' అంతా ముక్తకంఠంతో బదులిచ్చారు.

'అంతేకాదర్రా!... కరచాలనాలు కూడదు... ముద్దులు నిషిద్ధం...' ఆవేశపడుతూ చెప్పాడు.

'అయ్యో రామ! ఇదేం ఘోరకలి అండీ!' మాట్లాడకుండా... ఒకరినొకరు ముట్టుకోకుండా... ముద్దూ ముచ్చట లేకుండా ఇంట్లోవాళ్ళు చస్తారా ఏం.

'మరదేనేం చెప్తోంది! మింగటానికి తాగటానికి తప్ప మిగతా సమయాల్లో మాస్క్ ధరించే వుండాలి! నిద్రపోయేటప్పుడైనా సరే! స్వైన్ ఫ్లూ ఎక్కడ తనింటికొచ్చి తిష్ఠవేస్తుందోనే భయంతో మాట్లాడాడు.

ఇంట్లో ఎవరు ఆవులించినా... దగ్గినా సుబ్బారావు గుండె ఝల్లుమంటోంది.

'ఈ దరిద్రపుగొట్టు వ్యాధి ఏ దేశంనుండి ఇంపోర్ట్ అయిందోగానీ... ఇంట్లో మన చావుకొచ్చింది' సుబ్బారావు తండ్రి గొణిగాడు.

చనిపోయేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని టి.వి. వార్తల్లో వింటూంటే గుండె చెరువైపోతోంది. గుండెలవిసిపోతున్నయ్. కంటికి కునుకు లేకుండా చేస్తోంది.

సిటీబస్సుల్లో ట్రావెల్ చేయటాలు... కొలీగ్స్‌తో మాట్లాడటాలు... షేక్‌హ్యాండ్ ఇవ్వటాలు అన్నీ బంద్ చేసాడు సుబ్బారావు. మాస్క్ ధరించే ఆఫీసు కెడుతుంటే తోటివారంతా పకపకా నవ్వారు. హేళన చేశారు. అయినా డోన్ట్ కేర్!!

అలా నవ్వి హేళన చేసినవారిలో అనేకులు 'స్వైన్‌ఫ్లూ' బారినపడి 'హరీ' అన్నారు. అందుకే ఇంటా బైటా తాను అన్ని జాగ్రత్తలూ తీసుకోకతప్పటంలేదు.

పనిమనిషిని మాన్పించాడు. పిల్లల్ని కాన్వెంట్‌కి పంపటానికి వీల్లేదన్నాడు. ఇంట్లో కిటికీలు తలుపులు ఇరవై నాలుగు గంటలూ మూసి వుంచాల్సిందేనన్నాడు.

పాలవాడిని రావద్దన్నాడు. పేకెట్‌పాలూ వద్దనుకుని... మిల్క్‌పౌడర్ టిన్స్ తెచ్చిపెట్టాడు.

అందరికీ 'గ్లోవ్స్' కొని తెచ్చి అందరినీ తొడుక్కోమన్నాడు.

'పిల్లలను కాన్వెంట్‌కి పంపకపోతే... వాళ్ళ చదువు పాడైపోతుందండీ...' విరుచుకుపడింది ప్రసూన!

'నువ్ నోర్మూయ్! నాకు పాఠాలు చెప్పకు! బోడి చదువుపోతే పోయిందిలే! చదివిన క్లాసే మళ్ళీ చదువుతారు. నష్టమేంలేదు. పిల్లలకు 'స్వైన్‌ఫ్లూ' సోకితే వాళ్ళు మనకు శాశ్వతంగ దూరమౌతారు. ఆ క్షోభ జీవితాంతం భరించలేం...' పరిణామాలెలా వుంటాయో విపులీకరించాడు సుబ్బారావు.

ప్రసూన నెత్తి బాదుకుంది!

★★★★★

బైటికి వెళ్ళాలంటేనే భయమన్పించటంతో సుబ్బారావు 'సిక్' చేసి మెడికల్ సర్టిఫికేట్ ఆఫీసుకు పంపాడు.

ఇంట్లో ఎవరి సోపు టవలు వారిదే! ఒకరిది మరొకరకు వాడరాదనే నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఆడవాళ్ళు వుపయోగించే దువ్వెన సైతం మిగతా సభ్యులు వాడకూడదన్నాడు.

ఎవరు చీదినా వుమ్మినా వాష్‌బేసిన్లోనే... తర్వాత ఫినాయిల్‌తో బేసిన్ గ్లోవ్స్ తొడుక్కునే

శుభ్రపరచాలి!

ఇలా ఎన్నాళ్ళు? అనే ప్రశ్న వుత్పన్నమైంది. బుర్రగోక్కున్న సుబ్బారావు 'స్వైన్‌ఫ్లూ' దేశాన్ని వదిలి పారిపోయేవరకు అన్చెప్పుకున్నాడు మనసుతో!

ఒకరోజు సుబ్బారావు అత్తమామలు ఊరినుండి వచ్చి వాకిలిముందు ఆటో దిగి వీధి తలుపులు బాదుతున్నారు. గొంతులు చించుకుని 'అల్లుడూ' అనీ... 'అమ్మాయ్ ప్రసూనా!...' అంటూ ఒకటే కేకలు!

తలుపులు మాత్రం తెరచుకోలేదు. వీధినపోయే వారంతా వీళ్ళ కేకలకు నివ్వెరపోయారు.

వీళ్ళేమైనట్టు?... తలుపు బైట గడియపెట్టి తాళం వేసిలేదు... అంటే ఇంట్లోనే వున్నారన్నమాట! మరి అలాంటప్పుడు... ఇంట్లో వుండీ ఎందుకు తలుపు తీయనట్టు!

ఓరి దేవుడో!... అనుకోని అవాంతరమేదైనా వచ్చి అప్పులవారి బాధపడ్లేక అంతా మూకుమ్మడిగా ఏ విషమో తాగి ఆత్మహత్యకు పాల్పడలేదు కదా?... లోపలున్న మనుషులు క్షేమంగా వుంటే ఎంత బాదినా... గొంతు పగిలేట్టు అరచినా తలుపెందుకు తీయనట్టు?

ఆ వచ్చిన వారిద్దరూ వీధిగుమ్మంలో నిలబడే అనేక రకాలుగా ఆలోచించసాగేరు.

'ఏమండీ... అట్లా బెల్లం కొట్టిన రాయిలా నోరుపడిపోయిన వారిలా నిమ్మకు నీరెత్తినట్టు ఉలుకు పలుకు లేకుండా మౌనంగా వుంటారేం?- ఆ వచ్చింది... అరిచేతి తలుపుబాదేదీ మా అమ్మానాన్నండీ... వాళ్ళనెంతసేపని వాకిట్లో నిలబెడతారు?- పోనీ... నేవెళ్ళి తలుపు తీస్తాను...' ప్రసూన ప్రాణం విలవిల్లాడింది.

'నోర్మూయ్! తలుపు తీస్తే చంపేస్తానంతే!- మీవాళ్ళొచ్చారని నాకు తెలీదా ఏం?- వాళ్ళు ఎక్కడెక్కడ తిరిగొస్తున్నారో?... 'స్వైన్‌ఫ్లూ' బారినపడి మనింటికొచ్చి గుమ్మంలో నిలబడ్డారేమో ఎవరికి తెల్సు!! తియ్యను! ఆ దేవుడొచ్చినా తలుపులు తీసేది లేదు. వాళ్ళే తలుపులు బాదిబాదీ... గొంతు నొప్పి పుట్టేట్టు అరచి అరచీ... వెనుతిరిగి వెళ్ళిపోతారు- నువ్వు నోరెత్తకు...' ప్రసూనను కట్టడి చేశాడు సుబ్బారావు.

'మీ భయంపాడుగాను. నన్ను కని మీకు కట్టబెట్టిన వాళ్ళొచ్చి వీధిగుమ్మంలో నిలబడివుంటే... 'స్వైన్‌ఫ్లూ' అంటారేమిటండీ?-' ప్రసూన బావురుమంది.

'విమానాల్లో విదేశాలనుండి వచ్చే ప్రతివక్కరినీ ఎయిర్‌పోర్ట్‌లో... రైల్వేస్టేషన్లలో దిగే పాసింజర్లనూ ఏ ఒక్కరినీ వదలకుండా వైద్యబృందాలు 'స్వైన్‌ఫ్లూ' వున్నవారా కాదాని నిలదీసి పరీక్షిస్తున్న రోజులివి? అలాంటిది... ఏ'చెకప్పు' లేకుండా మీ వాళ్ళు

ఇంట్లోకి రానివ్వటమా...? ఇంపాజిబుల్! వాళ్ళకుండే రోగం మనకు అంటుకుంటుంది. నీకేం తెల్సు? కట్ట కట్టుకుని ఒకేసారి మృత్యువాత పడాల్సి వస్తుంది మనం...' వివరంగా చెప్పి మనిషి హైరానాపడ్డాడు.

'ఏమిటండీ మీ మొండితనం?' విసుక్కుంది.

'ఎస్! నేను మొండివాడినే! ఎందుకయ్యాను? మన్లో ఎవ్వరికీ 'స్వైన్‌ఫ్లూ' అంటుకోకూడదని! అందుకే ఈ జాగ్రత్త! విసిగి విసిగి వెనుదిరిగి వెళ్ళిపోతారు. మళ్ళీ ఎప్పుడో మనలను చూడాలన్పించినపుడు రాకమానర్తా?'-

'ఏడిచినట్టేవుంది మీ ఆర్గ్యుమెంట్...'

'మీవాళ్ళేకాదు... మావాళ్ళొచ్చినా తలుపుతీసి బంధువులను లోనికి ఆహ్వానించటం కుదరదు! దట్సాల్... ఇకపో! లోనికెళ్ళి పనిచూసుకో...' హూంకరించాడు.

ప్రసూన తాను బాత్‌రూమ్‌లోకెళ్ళినప్పుడు ఎక్కడ వీధి తలుపుతీసి వాళ్ళ పేరెంట్స్‌ని లోనికి ఆహ్వానిస్తుందోని... లోపల పెట్టిన గడియకు గోద్రెజ్ తాళంవేసి బీగాన్ని బొడ్లో దోపుకున్నాడు సుబ్బారావు.

భర్త చేష్టలు గమనించి 'మీకు పిచ్చెక్కింది. ఇరుగుపొరుగువాళ్ళు మనకులాగ తలుపులు కిటికీలు బిడాయించుకున్నారా? బైటకి వెళ్ళి పన్లు చూచుకోవటంలేదూ?-' ఇక వీధుల్లో మనుష్య సంచారమే కరువైందా?... ఎవరూ ఆఫీసులకు స్కూళ్ళకు వెళ్ళటంలేదా? దుకాణాలన్నీ మూతపడ్డాయా?-' కసికొద్దీ మాట్లాడింది ప్రసూన.

'అవునే! అవును! ఒక్క హాస్పిటల్స్... నర్సింగ్‌హోమ్స్ తప్పించి... వీధుల్లో జన సంచారం కరువైంది. 'కర్ఫ్యూ' విధించినట్టున్నయ్ వీధులన్నీ! సరేనా?- ఇహ ఎక్కువగా వాక్కు! కర్ఫ్యూ కంటే క్రూరమైనదే... ఈ స్వైన్‌ఫ్లూ... నీకేం తెల్సు! రోగం వచ్చి మంచానపడితే అప్పుడు తెలుస్తుంది... అనవసరంగ నాతో 'ఆర్గ్యూ' చేయద్దు నే చెప్పేమాట విను!!-'

'వాడొరి తలతిక్క వెధవ. వాడితో వాదన దేనికి తల్లీ?... మాటలతో వాడు మన డొక్క చించి డోలు కట్టగల దిట్ట! వాడితో మాట్లాడి గెలవలేం...' సుబ్బారావు తల్లి కోడలికి నచ్చచెప్పింది.

★ ★ ★ ★ ★

ఈ 'స్వైన్‌ఫ్లూ' కాదు గానీ... ఓ మార్నింగ్ వాకో... జాగింగో... లేకుండా పోయింది. ఇరవై నాలుగు గంటలూ కొంపలోనే వుండాలంటే బోర్ కొడుతోంది.

ఒకప్పుడు 'ఇన్‌ఫ్లూయెంజా' వచ్చి ఎందరినో పొట్టనబెట్టుకుంది. చివరికెట్లాగైతేనేం రోగానికి మందులు కనుక్కున్నారు.

తర్వాత 'బర్డ్‌ఫ్లూ' ఇంపోర్టైంది. కోళ్ళకు ఆ వ్యాధి సోకి వందలు వేలాదిగా చనిపోవటంతో ఫారం యాజమాన్యం దివాలా తీసింది.

కోడిమాంసం తినద్దని... చికెన్ బిర్యానీ జోలికి పోకూడదనీ ప్రభుత్వం అప్పుడు హెచ్చరికలు జారీచేసింది.

మళ్ళీ ఇన్నాళ్ళకు 'స్వైన్‌ఫ్లూ' ఒకటి! విదేశాలనుండి గాలికి కొట్టుకొచ్చి మన ప్రాణాలు తోడేస్తోంది. ఇదెక్కడి వుపద్రవంరా దేవుడాని గుండెలు బాదుకుంటున్నాడు సుబ్బారావు.

సుబ్బారావు భయపడ్డంతా అయింది! 'స్వైన్‌ఫ్లూ' ఇంట్లోవారికెవ్వరికీ సోకకూడదని తాను ఎన్ని ముందు జాగ్రత్తలు తీసుకున్నా- ఆ మహమ్మారి రోగం ఇంట్లో సభ్యులందరికీ రానే వచ్చింది.

అందరికీ జలుబు... దగ్గు... జ్వరం! ఇంటికి దగ్గర్లో వున్న నర్సింగ్‌హోమ్‌లో చెకప్ చేయించగా అందరికీ 'స్వైన్‌ఫ్లూ' వ్యాధి సోకిందని వెళ్ళి ఫీవర్ హాస్పిటల్లో జాయిన్ చేయమంటూ డాక్టర్ సలహా ఇచ్చాడు సుబ్బారావుకి!

ఆ మాట వినగానే సుబ్బారావు గుండె చెరువైంది. జవసత్వాలుడిగినట్టన్పించింది. పై ప్రాణం పైనే పోయినట్టయింది.

వ్యాధిసోకకూడదని తీసుకున్న జాగ్రత్తలన్నీ గాలికి కొట్టుకుపోయినయ్. శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైంది.

మనిషి గుండె బాదుకున్నాడు. లబోదిబోమన్నాడు.

తల్లిదండ్రి ప్రసూన ముగ్గురు పిల్లలూ వ్యాధిబారిన పడటంతో ఫీవర్ హాస్పిటల్లో ఇన్‌పేషంట్స్‌గ అందరినీ ఎడ్మిట్ చేశారు.

ఒకే కుటుంబంలో ఇంతమంది సభ్యులకు వ్యాధి సోకటం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఆరోగ్యశాఖామాత్యులు విచ్చేసి హాస్పిటల్‌లోవున్న సుబ్బారావు కుటుంబసభ్యులందరినీ పరామర్శించారు. సుబ్బారావుకి ధైర్యాన్ని నూరిపోశారు.

పేపర్ విలేఖరులు... టి.వి.వారు ఫీవర్ హాస్పిటల్ కొచ్చి సుబ్బారావుని ఇంటర్వ్యూ చేసి అనేక ప్రశ్నలు వేశారు. ఓదార్చారు.

తననుమాత్రం హాస్పిటల్లో వుండటానికి అనుమతించలేదు. అవసరమన్పిస్తే కబురు పెడతామని చెప్పి ఆస్పత్రి సూపర్నెంట్ తన మొబైల్ నెంబర్ తీసుకున్నాడు.

ఇంటికొచ్చినా సుబ్బారావుని దిగులు వెంటాడి వేటాడుతూనే వుంది. ఇదేం ఖర్మ! అందరూ ఒక్కసారిగ మంచంపట్టటం ఏమిటీ? తన ప్రారబ్ధం ఖర్మకాకపోతే...

బావురుమన్నాడు.

ఓ 'స్వైన్‌ఫ్లూ'!... నీకో దణ్ణం! నాపై 'కసి' పూనకు. ఎలాంటి అనర్థాన్నీ తెచ్చి పెట్టకు. మా కుటుంబసభ్యులను మృత్యువాత పడనీకు... మనసులో వేడుకున్నాడు.

ఆరవరోజు ఫీవర్ హాస్పిటల్ సూపర్నెంట్ సుబ్బారావుకి ఫోన్‌చేసి వెంటనే ఆస్పత్రికి రమ్మని చెప్పాడు.

'సారీ సుబ్బారావుగారూ! మా ప్రయత్నం మేం చేశాం! మీ వాళ్ళలో ఏ ఒక్కరినీ బతికించలేకపోయాం! వారి శవాలను మార్చురీలో వుంచాం! మీరు ఆ శవాలను హేండోవర్ చేసుకోండి...' చెప్పలేక చెప్పలేక జరిగింది వివరించాడు సూపర్నెంట్‌గారు.

ఆ మాట వినగానే సుబ్బారావు కుప్పకూలాడు. షాక్ నుండి కోలుకోవటానికి పావుగంట పట్టింది! అంతా ఒకేసారి 'స్వైన్‌ఫ్లూ' బారినపడి మృత్యుఒడిలోకి జారిపోయినందుకు దుఃఖం కట్టలు తెంచుకుంది. ఇక తనకు దిక్కెవరు? ఎవరూలేని అనాథ అయినాడు తాను. దేవుడెంతటి నిర్దయుడు?... వాపోయాడు.

'మహాశయా! అయ్యా శ్రీవారూ... ఓ సుబ్బారావుగారూ... తెల్లారింది. ఇంకా ఏమిటి మీ పలవరింత? కలకంటున్నారా? ఏదైనా పీడకల వచ్చిందా?... మీరు వెక్కి వెక్కి ఏడవటం ఇంటిల్లిపాదినీ భయపెట్టింది. లేవండి... నిద్రలేచి మీకొచ్చిన పీడకల ఎలాంటిదో మాకూ చెప్పరూ...' భర్తని తట్టిలేపుతూ అంది ప్రసూన.

కళ్ళు నులుపుకుంటూ నిద్ర మేల్కొని 'ఏమిటీ? కలకన్నానా?- నిజంకాదా?... ప్రసూనా ఓసారి నన్ను గిచ్చు...! ఆఁ! చాలు చాలు!... మరేం లేదోయ్... ఇంట్లో సభ్యులందరికీ 'స్వైన్‌ఫ్లూ' సోకి ఆస్పత్రిపాలైనట్టు... చనిపోయినట్టూ... పీడకల... పాపిష్టి కలొచ్చింది-' అన్నాడు సుబ్బారావు.

'అవును మరి! అలాంటి పాడుకలలు రాకేం చేస్తయ్. ఇరవై నాలుగు గంటలూ మీ ఆలోచనంతా ముష్టి 'స్వైన్‌ఫ్లూ' గురించేనాయె?... ఇకనైనా పిచ్చి పిచ్చి ఆలోచనలను మీ మనసులోకి రానీకండి! ఆ దేవుడి దయవల్ల అందరం ఇప్పటివరకూ బాగానే వున్నాం!

'అవునవును! అంతా నేను అనవసరంగా ఆలోచించి మనసులో భయాన్ని పెంచుకున్న స్వయంఫ్లూ!' హాయిగ నవ్వుకుంటూ వాష్‌బేసిన్ వేపే నడిచి పేస్ట్ బ్రష్‌మీద వేసుకున్నాడు సుబ్బారావు.

- సమాప్తం -